# పుస్తక సమీక్ష

## సినిమా పాటపై అపూర్వ కృషి




**సినిమా** అత్యంత శక్తిమంతమైన ప్రసార సాధనం. సినిమాల్లో పాటకు విశిష్టమైన స్థానం ఉంది. మనిషి మనుగడకు దిశానిర్దేశం చేస్తూ, సుతిమెత్తగా హెచ్చరిస్తూ సందేశాన్ని అందించే అద్భుతమైన శక్తి సినిమా పాటకు ఉంది. సినిమా వ్యాపార ప్రక్రియ కావచ్చు. కానీ, సినిమా పాట మనిషిని తట్టిలేపే ఓ మంత్రధ్వానం. 1931 లో తొలి తెలుగు సినిమా పుట్టినప్పటి నుంచి ఇప్పటిదాకా ఎంతో మంది సినీ గీత రచయితలు సాహిత్యపు విలువలతో కూడిన అపురూపమైన పాటలు రాశారు. తొలి సినీగేయ రచయిత చందాల కేశవదాసు మొదలుకుని సముద్రాల, పింగళి, శ్రీశ్రీ, ఆత్రేయ, దాశరథి, సినారె, వేటూరి, సిరివెన్నెల.. ఇలా 85 మంది సినీ గీత రచయితల పాటలపై విశ్వవిద్యాలయాల పరిశోధకులతో వ్యాసాలు రాయించి ప్రచురించిన అరుదైన పుస్తకం ఈ 'సినీగీతావరణం'. కె.ఆనందాచారి ప్రధాన సంపాదకత్వంలో, డా.తిరునగరి శరత్ చంద్ర సంపాదకులుగా వ్యవహరించిన ఈ పుస్తకం తెలుగు సినీ గీత రచయితలపై, తెలుగు సినిమా పాటపై పరిశోధన చేయాలనుకునే వారికి కరదీపికగా ఉపయోగపడుతుంది. సినిమా పాటలను అభిమానించే వారందరికీ ఇది ఓ కానుక.

### సినీగీతావరణం

**ప్రధాన సంపాదకులు:** కె.ఆనందాచారి
**పేజీలు:** 502; **ధర:** రూ. 650
**ప్రచురణ:** తెలంగాణ సాహితి
**ప్రతులకు:** నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్

... ✍ పెద్దపల్లి తేజస్వి

## బుక్ షెల్ఫ్



### పిట్ట గూళ్ళు

**రచన:** మేరెడ్డి యాదగిరి రెడ్డి
**పేజీలు:** 76; **ధర:** రూ. 100
**ప్రచురణ:** ధృతి ప్రచురణలు
**ప్రతులకు:** ప్రముఖ పుస్తక కేంద్రాలు
**ఫోన్:** 99494 15796

### పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం

**రచన:** గన్నవరపు నరసింహామూర్తి
**పేజీలు:** 184;
**ధర:** రూ. 150
**ప్రచురణ:** పాలపిట్ట బుక్స్
**ప్రతులకు:** ప్రముఖ పుస్తక కేంద్రాలు
**ఫోన్:** 98487 87284



### మధురోహలు

**రచన:** డా॥ ఎం.కె.రాము
**పేజీలు:** 120;
**ధర:** రూ. 200
**ప్రచురణ:** రసమయి పబ్లికేషన్స్
**ప్రతులకు:** ప్రముఖ పుస్తక కేంద్రాలు
**ఫోన్:** 98480 14793





### తీర్థయాత్ర

**రచన:** డా.కాపెర్ల పవన్ కుమార్
**పేజీలు:** 234;
**ధర:** రూ. 350
**ప్రతులకు:**
**ఫోన్:** 99083 00831

# ఘనం.. పీవీ వనం

## అగ్నిపూల చెట్టు



ప్రకృతిలో ప్రతి చెట్టూ మనిషికి ఏదో ఒక విధంగా ఉపయోగపడేదే. మోదుగు చెట్టు కూడా ఈ కోవలోదే. ఇది పది మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. మోదుగును సంస్కృతంలో 'బ్రహ్మ వృక్షం' అంటారు. కాబట్టి, దీన్ని 'దేవతా వృక్షం'గా పరిగణిస్తారు. మోదుగు పూలు విప్లవానికి, అమరత్వానికి సూచిక. అక్షర వాచస్పతి డా॥ దాశరథి రంగాచార్య తెలంగాణ నేపథ్యంలో రాసిన నవలల్లో 'మోదుగుపూలు' ప్రసిద్ధిచెందింది. నారింజ, ఎరుపు రంగుల కలయికలోని ఆ పూలగుత్తులను 'అగ్నిపూలు' అంటారు. అందుకే మోదుగు పూలు ప్రకృతి చిత్రకారులకు గొప్ప వస్తువు. ప్రఖ్యాత చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు చిత్రించిన 'అగ్నిపూలు' చిత్రాలు కనువిందు కలిగిస్తాయి.

మోదుగు తెలంగాణ అంతటా కనిపించే చెట్టు. వేసవిలో.. ముఖ్యంగా మార్చి, ఏప్రిల్‌లో నెలల్లో ప్రయాణాల్లో దారుల వెంట బాగా ఆకర్షించే చెట్టు మోదుగు. ఆకులు రాలిపోయి, ఎర్రని పూల గుత్తులతో భలే అందంగా ఉంటుంది. మోదుగు పూలు పూసే కాలంలోనే హోలీ పండుగ వస్తుంది. హోలీకి నాలుగు రోజుల ముందునుంచే ఈ పూలను సేకరిస్తారు. వాటిని ఉడికించి రంగు తీస్తారు. ఇది ప్రకృతి సిద్ధమైనది. చర్మానికి హాని కలిగించదు. నేడు హోలీ వేడుకలో కెమికల్స్‌తో తయారైన రంగులతో.. చర్మ వ్యాధులు, కంటి సమస్యలు, ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయి. వస్త్ర పరిశ్రమలో రసాయన రంగుల వాడకం ఆరోగ్య, పర్యావరణ సమస్యలకు దారితీస్తున్నది. వీటికి సహజ రంగులే ప్రత్యామ్నాయమని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

మోదుగు చెట్టు ఆకులతో విస్తళ్లు కుట్టి అమ్ముతారు. జొన్న బెరడు నుంచి తీసిన ఈనెలతోని ఈ ఆకులను విస్తరిగా కుడతారు. గ్రామాల్లో మోదుగు విస్తళ్ల కుట్టడం ఎంతో సరదాగా ఉండేది. విస్తరాకుల్లో భోజనం శ్రేష్ఠమైనది. విస్తరి సులభంగా భూమిలో కలిసిపోతుంది. ప్లాస్టిక్ ప్లేట్లకు ప్రత్యామ్నాయంగా విస్తరాకులు వాడి భూమిని కాపాడుకోవచ్చు. మోదుగు చెట్టులోని పంచాంగాలు (కొమ్మలు, బెరడు, ఆకులు, పువ్వులు, కాయలు) ఆయుర్వేద చికిత్సలో ఉపయోగపడతాయి. మోదుగు కొమ్మలను పవిత్రమైనవిగా భావిస్తారు. ఎండిన మోదుగ కొమ్మలను హోమాల్లో, పూజల్లో సమిధలుగా ఉపయోగిస్తారు.

■ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ కూతురు

## అది ఎవరు?

(...13వ పేజీ తరువాయి)

### సమాధానం:

వేలి ముద్రలే సైకో ట్విన్స్‌లో ఎవరు డ్రైవర్‌గా వచ్చారో తేల్చాయి. తన తల్లికి మందులు ఇవ్వాలంటూ జూబ్లీ బస్టాండ్‌కు వచ్చిన సైకో డ్రైవర్ కమలాకర్ రుద్రకు చెప్పడంతో అతని చేతిలోంచి రుద్ర విజిటింగ్ కార్డు తీసుకొన్నాడు. దానిపై వేలిముద్రలు పడ్డాయి. అది గుర్తొచ్చే.. ఇద్దరు సైకోలు పట్టుకొన్న ఫిజీ బాటిల్స్ ఇస్తే, ఎవరు డ్రైవర్‌గా వచ్చారో చెప్తానంటూ రుద్ర మెలిక పెట్టాడు. ఐడెంటికల్ ట్విన్స్ అయినప్పటికీ, ఏ ఇద్దరి కవలలకు ఒకే రకమైన వేలిముద్రలు ఉండవు. ఈ విషయం బాగా తెలిసిన రుద్ర.. సైకో డ్రైవర్ ఎవరో ఈజీగా కనిపెట్టాడు. కాగా, ఇంజినీరింగ్ పూర్తిచేసి ఫ్యామిలీకి దూరమై వ్యసనాలకు బానిసైన ఈ కవలలకు ప్రపంచంలో తామే గొప్ప మేధావులమని నమ్మకం. అయితే, కేసులను చాకచక్యంగా సాల్వ్ చేస్తున్న రుద్ర గురించి న్యూస్‌పేపర్‌లో గొప్పగా రాయడంతో ఇగో హర్టయ్యి ఈ ఇద్దరూ కలిసి పజిల్ గేమ్స్‌కి తెగబడ్డట్టు తర్వాతి విచారణలో తేలింది.